**ఉత్తమ నగరాలు**

ప్రపంచంలో టాప్-50 నగరాల జాబితాను 'టైమ్ ఔట్' జనవరి 23న విడుదల చేసింది. దీనిలో ముంబై 12వ స్థానంలో ఉంది. ఈ జాబితాలో భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక నగరంగా ముంబై నిలిచింది. ఈ జాబితాలో న్యూయార్క్ మొదటి స్థానంలో నిలువగా.. కేప్‌టౌన్ 2, లండన్ 3, బెర్లిన్ 4, మాడ్రిడ్ 5, మెక్సికో సిటీ 6, లివర్‌పూల్ 7, టోక్యో 8, రోమ్ 9, పోర్టో 10, పారిస్ 11వ స్థానాల్లో నిలిచాయి. నగరాల్లో లభించే ఆహారం, వాటిలోని భవన నిర్మాణ రీతులు, సాంస్కృతిక సంపద వంటి వాటిపై ప్రజాభిప్రాయం, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. ఈ నగరాల్లో నివసించడం పట్ల ప్రజలు ఏ మేరకు సంతోషంగా ఉన్నారనే దాన్ని బట్టి ర్యాంకులను కేటాయించారు.

# తెలంగాణలోని రక్షిత ప్రాంతాలు - జీవవైవిధ్యం

- రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12 రక్షిత ప్రాంతాలున్నాయి. ఇందులో 9 అభయారణ్యాలు, 3 జాతీయ పార్కులు ఉన్నాయి. మొత్తం అటవీ విస్తీర్ణంలో ఈ రక్షిత ప్రాంతాల అటవీ విస్తీర్ణం 5,672 చ.కి.మీ.
- పరిరక్షిత ప్రాంతాల్లో అంతరించిపోతున్న 'మగ్గర్' అని పిలిచే బురద నీటి మొసళ్లకు నెలవైన మంజీర వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, శివారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల్లో ముఖ్యమైన చిత్తడి నేలలు విస్తరించి ఉన్నాయి. ఇందులో అంతరించిపోతున్నటువంటి బురదలో ఉండే మొసలికి ఈ సంరక్షణ కేంద్రం జన్మస్థలం. మంజీర వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వేల సంఖ్యలో విదేశీ పక్షులను ఆకర్షిస్తుంది. మంజీర వన్యప్రాణి సంరక్షణ కేంద్రం గెలు కొంగ, గాలుకొంగ, హెరాన్ కొంగ, పెద్ద బాతులు వంటి అనేక వలస పక్షులను సైతం ఆకర్షిస్తుంది.

## కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం

- 1965లో కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రాన్ని స్థాపించారు. ఈ వన్యప్రాణి అభయారణ్యాన్ని '1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం' ప్రకారం 1999, జూలై 14న ప్రకటించారు.
- ఇది మహారాష్ట్రలోని 'తడోబా' అడవి ప్రాంతం, సహ్యాద్రి పర్వతశ్రేణుల మధ్య విస్తరించి ఉన్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ పులుల కేంద్రాన్ని 2012లో కేంద్ర క్యాబినెట్ 40వ టైగర్ రిజర్వ్‌గా గుర్తించారు. ప్రస్తుతం భారతదేశంలోని మొత్తం పులుల సంరక్షణ కేంద్రాలు 54 ఉన్నాయి.
- దీని పరిధి 2,01,544 హెక్టార్లుగా విస్తరించి ఉంది. 2015 చ.కి.మీ. విస్తీర్ణంలో కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం నాలుగు జిల్లాల పరిధిలో విస్తరించింది. అవి.. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్. దీని పరిధి ఎక్కువగా నిర్మల్ జిల్లాలో ఉంది.
- ఈ టైగర్ రిజర్వ్ అభయారణ్యంలో పులులు, చిరుతలు, అడవిదున్నలు, ఎలుగుబంటి, సాంబార్, మనుబోతు, మచ్చలజింక, పునుగుపిల్లి, సరీసృపాలు, క్షీరదాలు వంటివి ఉన్నాయి.
- ఇది రాష్ట్రంలో అధికంగా టేకు చెట్లు గల అభయారణ్యం. దీని గుండా కడెం నది ప్రవహిస్తుంది. ఈ రిజర్వ్ ప్రాంతం, మహారాష్ట్రలోని 'తడోబా అంధేరి' టైగర్ రిజర్వ్, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లు ఒక దానికొకటి ఆనుకొని ఉన్నాయి. అందువల్ల పులులు ఒక దగ్గర నుంచి మరొక దగ్గరకు వలసలు వెలుతుంటాయి.

## ఏటూరు నాగారం అభయారణ్యం

- ఇది తెలంగాణలో అతి ప్రాచీన అభయారణ్యం. ఈ అభయారణ్యం తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉంది. ఈ అభయారణ్యం ప్రస్తుతం ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రం వద్ద 1952, జనవరి 30న ఏర్పాటు చేశారు.
- ఇది 803 చ.కి.మీ. విస్తీర్ణంలో గోదావరి నదీ తీరాన దక్కన్ పీఠభూమిలో ఉంది. దీని పరిధిలోని తాడ్వాయి మండల కేంద్రంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం జాతర రెండేండ్లకోసారి జరుగుతుంది.

- మొత్తం 12 రక్షిత ప్రాంతాల్లో 9 అభయారణ్యాలు ఉన్నాయి. అవి..

1) **అమ్రాబాద్ పులుల సంరక్షణ కేంద్రం**

- దీన్ని రాజీవ్‌గాంధీ వైల్డ్‌లైఫ్ అభయారణ్యం అంటారు. అమ్రాబాద్ పులుల సంరక్షణ కేంద్రం నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో విస్తరించి ఉంది. ఈ అభయారణ్యం వైశాల్యం 2,166 చ.కి.మీ..
- దీన్ని 1978లో వన్యప్రాణి మృగసంరక్షణ కేంద్రంగా గుర్తించారు. 1983లో పులుల సంరక్షణ కేంద్రంగా ప్రకటించారు.
- ఇక్కడి గరిష్ఠ ఉష్ణోగ్రత $45^0$C నుంచి కనిష్ఠంగా $8^0$C, 90-100 సెం.మీ. సగటు వర్షపాతం నమోదువుతుంది. ఈ అటవీ ప్రాంతంలో మిశ్రమ ఆకురాల్చే అడవులు, గడ్డిభూములు, వెదురు వంటి అటవీ రకాలున్నాయి. ఈ ప్రాంతంలో అత్యంత ప్రాచీన గిరిజన జాతులైన చెంచులు, లంబాడాలు నివసిస్తున్నారు. ఈ అడవుల్లో అతిముఖ్యమైన జంతుజాతి పులిని గుర్తించారు.

## అభయారణ్యాలు

- దీని పరిధిలో కృష్ణానది, నాగార్జునసాగర్ జలాశయం, పెద్ద దూకుడు, సలేశ్వరం జలపాతాలు ఉన్నాయి. అభయారణ్యంలో పులులు, చిరుత, తోడేలు, అడవికుక్క, జాకాల్, హైనా, జింకలు, మొరిగే జింకలు వంటి అడవి జంతువులు దాదాపు 200 వివిధ రకాల పక్షి జాతులు ఉన్నాయి.
- అలాగే దీన్ని గొప్ప జీవ వైవిధ్య హాట్‌స్పాట్‌తో మంచి అటవీ ప్రాంతాన్ని కలిగి కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉంది. ఎకోటూరిజం ప్రాజెక్ట్ ద్వారా మన్ననూర్, ఫర్హాబాద్, మల్లెలతీర్థం, దోమలపెంట, అక్కడి చెంచు తెగ గిరిజనులు స్థానిక కమ్యూనిటీలు ఎక్కువ ప్రయోజనం పొందుతున్నాయి.
- పులుల గణన నివేదిక-2018 ప్రకారం రాష్ట్రంలోని అడవుల్లో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ అభయారణ్యంలో పులులు కలిపి మొత్తంగా రాష్ట్రంలో 26 పులులు ఉన్నట్లు 'ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ రిపోర్ట్' పేర్కొన్నది.



- అమ్రాబాద్ పులుల సంరక్షణ కేంద్రం పరిరక్షణను భారత ప్రభుత్వ కేంద్ర అటవీ శీతోష్ణస్థితి మార్పు మంత్రిత్వ శాఖ చూస్తుంది.

- ఇక్కడ ప్రధాన వృక్షం టేకు. అడవిదున్న, పులి, కృష్ణ జింక, తోడేలు, సాంబార్, పైథాన్ వంటి వాటిని సంరక్షిస్తున్నారు.

## పాకాల అభయారణ్యం

- పాకాల అభయారణ్యం వరంగల్ జిల్లాలో ఉంది. దీని వైశాల్యం 860 చ.కి.మీ. ఉంది. ఇక్కడ గరిష్ఠంగా 46 $^0$C, కనిష్ఠంగా $10^0$C ఉష్ణోగ్రత, 110 సెం.మీ. వర్షపాతం నమోదవుతుంది. అడవుల రకాలు ఆకురాల్చే అడవులు, మిశ్రమ అడవులతో కూడిన నదీ పర్యావరణ పరిరక్షణ కలిగి ఉన్నాయి. ఇక్కడ అనేక రకాలైన అడవి జాతులు నివసిస్తున్నాయి.
- ఈ అడవుల్లో పెద్దపులులు, అడవి దున్నలు, జింకలు, చిరుత పులులు, ఎలుగుబంట్లు, కోతులు వంటి జాతులు, మొసళ్లు, నాగుపాములు, ఊసరవెల్లి మొదలైనవి నివసిస్తున్నాయి. పక్షి జాతికి చెందిన కొంగలు, గుడ్లగూబ, అడవి బాతులు వంటి వివిధ రకాల పక్షులు ఉన్నాయి.

## శివారం వన్యప్రాణి అభయారణ్యం

- శివారం అభయారణ్యం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల మధ్య విస్తరించి ఉంది. ఎక్కువగా దీని పరిధి మంచిర్యాల జిల్లాలో ఉంది. ఈ అభయారణ్యం 130 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉంది.
- ఈ అభయారణ్యాన్ని మొసళ్ల పరిరక్షణ కోసం 'హైదరాబాద్ ఫిషరీ చట్టం-1952'ను తీసుకొచ్చారు. దీన్ని 1978లో వన్యప్రాణి సంరక్షణ చట్టం చేశారు. ప్రధానంగా ఇక్కడ మగ్గర్ మొసళ్లు, పొడి ఆకురాల్చే అడవులను సరక్షిస్తున్నారు.

## కిన్నెరసాని అభయారణ్యం

- ఇది భద్రాచలం నుంచి 35 కి.మీ. దూరంలో, కొత్తగూడెం నుంచి 24 కి.మీ. దూరంలో భద్రాద్రి జిల్లాలో దండకారణ్యంలో భాగంగా, గోదావరి నదీ తీరాన ఏర్పాటు చేశారు.

**గ్రూప్స్ ప్రత్యేకం జాగ్రఫీ**




- ఈ అభయారణ్యంలో పులి, జింక, కొండచిలువలు, పలు వృక్షజాతులు ఉన్నాయి. ఇది 635 చ.కి.మీ. విస్తీర్ణంలో విస్తరించి, కిన్నెరసాని రిజర్వాయర్‌కు దగ్గరలో ఉంది.
- ఇక్కడి ప్రధాన ఆకర్షణలు జింకల పార్క్, గ్లాస్ గెస్ట్ హౌస్, ఎకలాజికల్ పార్క్, పర్యావరణ విధానాలు ముఖ్యమైనవి. దీన్ని ప్రభుత్వం 1937లో అభయారణ్యంగా ప్రకటించింది. ఇక్కడ నమోదయ్యే గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు $45^0$C నుంచి $15^0$C, సగటు సరాసరి వర్షపాతం 87 సెం.మీ..

## మంజీర అభయారణ్యం


- ఇది హైదరాబాద్‌కు 50 కి.మీ. దూరంలో మంజీర నది వెంట 36 కి.మీ. పరిధిలో విస్తరించి ఉంది. దీన్ని 1978లో ఏర్పాటు చేశారు. మంజీర వన్యప్రాణి అభయారణ్యం సంగారెడ్డి జిల్లాలో ఉంది. దీని వైశాల్యం 20 చ.కి.మీ..
- ఈ అభయారణ్యంలో 70 రకాల పక్షి జాతులు, క్షీరదాలు, వృక్షజాతులు, సరీసృపాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో సగటు గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు $42^0$C నుంచి $15^0$C వరకు నమోదవుతాయి. ఇక్కడ సగటు వర్షపాతం 81 సెం.మీ..
- ఇక్కడ అంతరించిపోతున్న వృక్షజాతులు ఎన్నో ఉన్నాయి. ఇది మగ్గర్ మొసళ్లకు నిలయంగా ఉంది.
- దీని పరిధిలో మంజీర జలాశయం మానవ నిర్మిత జలాశయంలో ముఖ్యమైంది. ఈ జలాశయం ద్వారా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.
- ఈ జలాశయం తొమ్మిది దీవుల సముదాయంగా ఉంది. వీటిలో పుట్టిగడ్డ, బాపం గడ్డ, సంగం గడ్డ, కరణం గడ్డ తదితర తొమ్మిది దీవులున్నాయి. ఈ ద్వీపాలు పక్షిజాతులకు నిలయంగా ఉన్నాయి.

## పోచారం అభయారణ్యం

- దీన్ని మెదక్ జిల్లా పోచారం సరస్సు వద్ద నెలకొల్పారు. ఒకప్పుడు నిజాం రాజులు ఈ ప్రాంతంలో వేటాడేవారని చెబుతారు. ఈ అభయారణ్యం దాదాపు 130 చ.కి.మీ. విస్తీర్ణంలో అనేక రకాల వృక్షాలు, పూల మొక్కలతో అందంగా అలరారుతుంది.
- పోచారం సరస్సు ఈ వన్యప్రాణి అభయారణ్యం పక్కనే ఉంటుంది. ఈ పర్యావరణ పర్యాటక క్షేత్రంలో లేళ్లు, జింకలు ఉన్నాయి. వేసవికాలంలో $46^0$C ఉష్ణోగ్రతలు ఉన్నప్పటికి శీతాకాలంలో $6^0$C ఉష్ణోగ్రతలకు పడిపోతాయి. ఇక్కడ చిరుతపులి, అడవి పిల్లులు, అడవి కుక్కలు, తోడేళ్లు, నక్కలు ఇంకా అనేక రకాల జంతువులు ఉన్నాయి. ఇక్కడ సగటు వర్షపాతం 800 సెం.మీ. వరకు నమోదవుతుంది.

## ప్రాణహిత అభయారణ్యం

- ఈ అభయారణ్యం మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులో ఉంది. ఇది మంచిర్యాల జిల్లాలో ఉంది. ఇది ప్రాణహిత నదీ సరిహద్దులో ఉంది. 130 చ.కి.మీ. విస్తీర్ణంలో విస్తరించింది. దీన్ని 1980లో వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద చట్టం చేశారు. ఇక్కడి అడవుల్లో 'నాయక్‌పోడ్' అనే గిరిజన జాతివారు నివసిస్తున్నారు. వీరు అడవిలో లభించే కలప, అడవి ఉత్పత్తులు, పోడు వ్యవసాయంపై ఆధారపడుతున్నారు.
- ఇక్కడ సగటు వర్షపాతం 90 సెం.మీ.. ఈ అడవుల్లో పొడి ఆకురాల్చే అడవులు, గడ్డిజాతికి చెందిన అడవుల రకాలు ఉన్నాయి. ఇక్కడ గరిష్ఠ ఉష్ణోగ్రత $46^0$C, కనిష్ఠంగా $9^0$Cగా నమోదవుతుంది. ఇక్కడ ప్రత్యేకంగా కృష్ణజింకల (బ్లాక్ బక్స్)ను కాపాడుతున్నారు.



## మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణలో ఏర్పాటు చేసిన కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం వరుస క్రమంలో ఎన్నోది?
   1) 54 2) 45 3) 44 4) 40
2. తెలంగాణలో ఎక్కువగా అంతరించిపోయే వృక్షజాతులు గల అభయారణ్యం ఏది?
   1) మంజీర 2) పోచారం
   3) కిన్నెరసాని 4) ఏటూరు నాగారం
3. అమ్రాబాద్ పులుల రిజర్వ్ ఏ జిల్లాలో విస్తరించి లేదు?
   1) మహబూబ్‌నగర్ 2) నాగర్‌కర్నూలు
   3) వనపర్తి 4) నల్లగొండ
4. ఏ అభయారణ్యంతో తడోబా, ఇంద్రావతి టైగర్ రిజర్వులకు సంబంధం ఉంది?
   1) కిన్నెరసాని 2) కవ్వాల్
   3) అమ్రాబాద్ 4) మంజీరా
5. ఏటూరు నాగారం అభయారణ్యంలో ప్రధాన వృక్షం ఏది?
   1) టేకు 2) ఎర్రచందనం
   3) మంచిగంధం 4) వెదురు
6. తెలంగాణ మంజీర, శివారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల్లో అతి ముఖ్యమైన చిత్తడి నేలల జంతువును గుర్తించండి?
   1) మగ్గర్ మొసళ్లు 2) చిరుతపులులు
   3) పులులు 4) కృష్ణజింక
7. అమ్రాబాద్ అభయారణ్యాన్ని కింది ఏ సంవత్సరంలో పులుల సంరక్షణ కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించింది?
   1) 1978 2) 1980 3) 1981 4) 1983

జవాబులు : 1-4, 2-1, 3-3, 4-2, 5-1, 6-1, 7-4

జి గిరిధర్
సివిల్స్ ఫ్యాకల్టీ
ఏకేఎస్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్
అశోక్‌నగర్, హైదరాబాద్
9966330068

